పక్కా ప్రణాళిక.. ప్రత్యేక తరగతులు

- శతశాతం ఫలితాలే లక్ష్యం
- ఏప్రిల్ 3 నుంచి పదోతరగతి పరీక్షలు
- రోజూ 4 సబ్జెక్టుల్లో ప్రిపరేషన్
- ప్రత్యేకంగా స్టడీ అవర్స్


గోపాలపట్నం జిల్లా పరిషత్ బాలికల ఉన్నత పాఠశాలలో విద్యార్థులను చదివిస్తున్న ఉపాధ్యాయులు


డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ గురుకుల పాఠశాలలో బోధన చేస్తున్న ఉపాధ్యాయురాలు

గోపాలపట్నం: పదో తరగతిలో వంద శాతం ఫలితాలే లక్ష్యంగా విద్యా శాఖాధికారులు చర్యలు చేపట్టారు. ఏప్రిల్ 3వ తేదీ నుంచి పది పరీక్షలు జరగనున్న నేపథ్యంలో పక్కా ప్రణాళికతో విద్యార్థులను సన్నద్ధం చేస్తున్నారు. సిలబస్ పూర్తి చేసిన ఉపాధ్యాయులు రివిజన్ చేస్తూ విద్యార్థుల సందేహాలను నివృత్తి చేస్తున్నారు. ప్రభుత్వం విడుదల చేసిన షెడ్యూల్‌కు అనుగుణంగా ప్రత్యేక తరగతులు నిర్వహిస్తున్నారు. ప్రతి సబ్జెక్టుపై పట్టు సాధించేలా ఉపాధ్యాయులు ప్రాక్టీస్ చేయిస్తున్నారు. రైటింగ్ స్కిల్స్ పెంచుకునేలా తీర్చిదిద్దుతున్నారు. పరీక్షల ఒత్తిడిని అధిగమించేలా అవగాహన కల్పిస్తున్నారు. చదువులో వెనుకబడిన విద్యార్థులను గుర్తించి శిక్షణ ఇస్తున్నారు. అత్యుత్తమ ఫలితాలు సాధించడమే లక్ష్యంగా ముందుకు సాగుతున్నారు. గోపాలపట్నం పరిధిలోని 6 జిల్లా పరిషత్ హైస్కూళ్లలో బాలురు బాలికలు మొత్తంగా 768, ఒకేషనల్ విద్యార్థులు 46 మంది పరీక్షలకు సిద్ధపడుతున్నారు.

ఉత్తీర్ణతా శాతం పెంచేలా కార్యాచరణ

ప్రతి రోజూ ఉదయం 8.30 నుంచి సాయంత్రం 5 గంటల వరకూ తరగతులు నిర్వహిస్తున్నారు. సాయంత్రం చివరి పీరియడ్ గంట చొప్పున నిర్వహిస్తూ మధ్యలో రెండు పీరియడ్స్ కలిపి ఒక సబ్జెక్టుపై దృష్టి పెడుతున్నారు. అందులో 45 నిమిషాల ప్రిపరేషన్, మరో 45 నిమిషాల పరీక్ష నిర్వహిస్తున్నారు. రోజు వారీ పరీక్షల్లో చేస్తున్న తప్పులపై విద్యార్థులకు అవగాహన కల్పించడంతోపాటు ఒత్తిడికి గురికాకుండా ఉపాధ్యాయులు పలు సూచనలిస్తున్నారు. ఇప్పటికే ఆరు రౌండ్ల ప్రాక్టీస్ టెస్టులు, ప్రీ ఫైనల్ నిర్వహించగా.. ఈ నెల 15 నుంచి రెండో ప్రీ ఫైనల్ పరీక్షలు నిర్వహిస్తున్నారు. ఇప్పటి వరకూ నిర్వహించిన పరీక్షల్లో విద్యార్థులు ఏ సబ్జెక్టుల్లో వెనుకబడి ఉన్నారో లోపాలను గుర్తించి ఏ, బీ, సీ, డీ గ్రేడులుగా విభజించారు. సీ, డీ గ్రేడ్ విద్యార్థుల ఉత్తీర్ణతా శాతం పెంచేలా విద్యాశాఖాధికారులు ప్రత్యేక కార్యాచరణ రూపొందించారు.

ఒత్తిడిని అధిగమించేలా..

టెన్త్ పబ్లిక్ పరీక్షలంటే విద్యార్థుల్లో ఎంతో కొంత ఆందోళన, ఒత్తిడి ఉంటాయి. దాని నుంచి ఉపశమనం పొందేలా విద్యార్థులకు మోటివేషన్ తరగతులు నిర్వహిస్తున్నారు. ఆత్మస్థైర్యంతో పరీక్షలు రాసేలా సూచనలిస్తున్నారు. ప్రతి ఉపాధ్యాయుడు కొంతమందిని దత్తత తీసుకుని తర్ఫీదునిస్తున్నారు. విద్యార్థుల తల్లిదండ్రులతో పాఠశాలల్లో ప్రత్యేక సమావేశాలు నిర్వహించి ఇంటి వద్ద పిల్లలకు ఒత్తిడి లేకుండా చూడాలని సూచించారు.

స్టడీ అవర్స్‌తో చాలా ప్రయోజనం



స్టడీ అవర్స్ ఎంతో ప్రయోజనకరంగా ఉన్నాయి. శ్రద్ధగా చదువుతూ ఆ సమయంలో వచ్చే సందేహాలను సంబంధిత ఉపాధ్యాయులను అడిగి నివృత్తి చేసుకుంటున్నాం. దీంతో పాఠ్యాంశాలపై పూర్తి అవగాహన ఏర్పడుతోంది.

– ధనశ్రీ, గోపాలపట్నం జిల్లా పరిషత్ ఉన్నత బాలికల పాఠశాల

ప్రణాళికతో చదువుతున్నాం



ఉపాధ్యాయులు చెప్పినట్టు పక్కా ప్రణాళికతో చదువుతున్నాం. దీంతో ఒత్తిడి అనిపించడం లేదు. మంచి మార్కులు సాధిస్తామనే నమ్మకం ఏర్పడింది. ఉపాధ్యాయులు చాలా చక్కని సూచనలిస్తున్నారు. మాలో ఆత్మస్థైర్యం పెరిగింది.

– ఎస్. చాందిని, మేహాద్రి గెడ్డ గురుకుల పాఠశాల

గ్రేడ్ల వారీగా విభజించి శిక్షణ

విద్యార్థులను ఏ, బీ, సీ, డీ గ్రేడులుగా విభజించి చదివిస్తున్నాం. ఏ గ్రేడ్ విద్యార్థులు ఎక్కువ మార్కులు సాధించేలా తర్ఫీదునిస్తున్నాం. పాఠశాలలో 50 శాతానికి పైగా సీ, డీ గ్రేడుల విద్యార్థులున్నందున వారిపై ప్రత్యేక శ్రద్ధ వహిస్తున్నాం. కలెక్టర్, డీఈవో ఆదేశాల మేరకు 40 రోజుల కార్యాచరణ ప్రణాళికను అమలు చేస్తున్నాం.

–ఎస్తేరు హెప్సిబాహెచ్‌ఎం, గోపాలపట్నం హైస్కూల్

క్లుప్తంగా

క్లాప్ వాహన డ్రైవర్ల నిరసన


గోపాలపట్నం బంక్ వద్ద క్లాప్ వాహనాలు నిలిపి నిరసన తెలుపుతున్న డ్రైవర్లు

గోపాలపట్నం: ఎంఎస్‌ఎఫ్ అధికారులు వేధింపులకు పాల్పడుతున్నారంటూ క్లాప్ వాహన డ్రైవర్లు గోపాలపట్నం బంక్ వద్ద మంగళవారం నిరసనకు దిగారు. ఎనిమిదో జోన్‌లోని సచివాలయాల పరిధిలో చెత్తను సేకరించి డంపింగ్ యార్డుకు తరలించే సమయంలో కాస్త ఆలస్యమైనా వాహనానికి రూ.500 చొప్పున చెల్లించాలంటూ డిమాండ్ చేయడం చాలా దారుణమని 73 క్లాప్ వాహన డ్రైవర్లు ఆవేదన వ్యక్తం చేశారు. తమకు వచ్చే రూ.10 వేల జీతంలో ఇలా లాగేసుకుంటే ఇంకేమి మిగులుతుందని ప్రశ్నించారు. ఈ విధానాన్ని రద్దు చేసి ఆదుకోవాలని కోరారు.

ఘనంగా ఉగాది సంబరాలు



సంబరాల్లో విద్యార్థినుల నృత్య ప్రదర్శన

అగనంపూడి: దువ్వాడ విజ్ఞాన్ ఇంజినీరింగ్ కళాశాలలో ఉగాది సంబరాలను మంగళవారం ఘనంగా నిర్వహించారు. తెలుగుదనానికి ప్రతీకగా నిలిచే సంవత్సరాది అందరి జీవితాల్లో ఆనందం నింపాలని రెక్టార్ మధుసూదనరావు ఆకాంక్షించారు. ఉగాది పండగ అంటే షడ్రుచులు గుర్తుకొస్తాయని, మనిషి జీవితం కూడా షడ్రుచుల సమ్మేళనమని అన్నారు. సంబరాల్లో భాగంగా విద్యార్థులు సంప్రదాయ నృత్యాలతో ఆకట్టుకున్నారు. కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపాల్ బి.అరుంధతి, వైస్ ప్రిన్సిపాల్ కె.మధుసూదనరావు, డీన్ బి.సతీష్, బి.ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

విశాఖ ఉక్కు ప్రజల ఆస్తి

కూర్మన్నపాలెం: సంపదను సృష్టించలేని కేంద్ర ప్రభుత్వానికి దేశసంపదను అమ్మే హక్కు లేదని ఉక్కు పరిరక్షణ, పోరాట కమిటీ నాయకులు తెలిపారు. విశాఖ ఉక్కు దేశ ప్రజల ఆస్తి అని, దానిని ప్రైవేట్ వ్యక్తుల చేతిలోకి పోనివ్వకుండా కాపాడుకుంటామని స్పష్టం చేశారు. స్టీల్‌ప్లాంట్ ప్రైవేటీకరణకు వ్యతిరేకంగా కూర్మన్నపాలెం కూడలిలోని స్టీల్‌ప్లాంట్ ఆర్చి వద్ద నిర్వహిస్తున్న రిలే నిరాహార దీక్షల్లో 768వ రోజు, మంగళవారం సీవో, సీసీపీ విభాగాల కార్మికులు పాల్గొన్నారు. దీక్షా శిబిరాన్ని ఉద్దేశించి పోరాట కమిటీ నాయకులు మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం చేస్తున్న ప్రైవేటీకరణ కుట్రలో భాగంగా యాజమాన్యం ఉక్కు ఉత్పత్తులు తయారీకి కావలసిన రా మెటీరియల్స్‌ను సమకూర్చడంలో ఉదాసీనంగా వ్యవహరిస్తోందని ఆరోపించారు. రోజుకో విభాగంలో ఉత్పత్తిని నిలిపివేస్తూ కొన్ని విభాగాలను ప్రైవేటు వారికి కట్టబెట్టాలని ప్రయత్నం చేయడం దుర్మార్గమైన చర్య అన్నారు. ప్రజా ఉద్యమాలకు ఎంత పెద్ద నియంతైనా తలవంచక తప్పదన్నారు. ఇప్పటికైనా కేంద్ర ప్రభుత్వం తన తీరును మార్చుకుని స్టీల్ ప్లాంట్‌ను ప్రభుత్వ రంగంలోనే కొనసాగించాలని, లేదంటే తీవ్ర పరిణామాలు ఎదుర్కొనక తప్పదని హెచ్చరించారు. కార్యక్రమంలో పోరాట కమిటీ నాయకులు, ఇతర కార్మికులు పాల్గొన్నారు.

ఉక్కు కార్మికుల ధర్నా


స్టీల్‌ప్లాంట్ బీసీ గేటు వద్ద ధర్నా చేస్తున్న కార్మికులు

ఎడగంట్యాడ: విశాఖ స్టీల్‌ప్లాంట్‌ను ప్రభుత్వ రంగంలోనే కొనసాగించాలని డిమాండ్ చేస్తూ ఉక్కు పరిరక్షణ, పోరాట కమిటీ ఆధ్వర్యంలో స్టీల్‌ప్లాంట్ బీసీ గేటు వద్ద మంగళవారం ధర్నా చేశారు. నాయకులు మాట్లాడుతూ ప్లాంట్‌ను పూర్తి సామర్థ్యంతో నడపాలన్నారు. ఉద్యోగులకు నూతన వేతనాలు చెల్లించాలని కోరారు. డి.ఆదినారాయణ, మంత్రి రాజశేఖర్, అయోధ్యరామ్, కేఎస్ఎస్ఎన్ రావు, మసేను రావు, తాతారావు, డీవీ రమణారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

భక్తిశ్రద్ధలతో నూకాలమ్మ పూజలు


పాత చెక్‌పోస్టు ఏరియా ఆలయంలో నూకాలమ్మను దర్శించుకున్న ఆనంద్‌కుమార్


జనతాకాలనీ వద్ద జరిగిన పూజలో పాల్గొన్న ఎమ్మెల్యే గణబాబు


గోపాలపట్నం నూకాలమ్మ అమ్మవారి ఆలయం బయట పూజలు చేస్తున్న భక్తులు

మల్కాపురం: భక్తుల పాలిట కొంగు బంగారమైన నూకాలమ్మ తల్లి పూజలు పారిశ్రామిక ప్రాంతంలోని పలు ఆలయాల్లో మంగళవారం ఘనంగా నిర్వహించారు. కొత్త అమావాస్య సందర్భంగా నిర్వహించిన పూజల్లో మహిళలు అధిక సంఖ్యలో పాల్గొని అమ్మవారిని దర్శించుకుని కానుకలు సమర్పించుకున్నారు. జీవీఎంసీ 59వ వార్డు పాతచెక్‌పోస్టు ఏరియాలోని నూకాలమ్మ ఆలయంలో ఆలయ ధర్మకర్త పుర్రె అప్పారావుయాదవ్ ఆధ్వర్యంలో జరిగిన పూజా కార్యక్రమంలో ఎంఎస్‌ఎంఈ చైర్మన్, వైఎస్సార్‌సీపీ పశ్చిమ సమన్వయకర్త ఆడారి ఆనంద్‌కుమార్ పాల్గొని అమ్మవారికి పసుపు కుంకుమలతో పూజలు చేశారు. ఈ సందర్భంగా ఆలయానికి డీజే సౌండ్ సిస్టంను వితరణగా ఇచ్చారు. కార్యక్రమంలో వార్డు పార్టీ అధ్యక్షుడు పుర్రె సురేష్‌యాదవ్, 60వ వార్డు కార్పొరేటర్ పీవీ సురేష్, పార్టీ నాయకులు రేవళ్ల సత్యనారాయణ,ఎం.పెంటారావు,పొట్టిమూర్తి,సంపత్ పాల్గొన్నారు.

- జనతాకాలనీ వద్ద జరిగిన పూజా కార్యక్రమంలో ఎమ్మెల్యే పి.గణబాబు పాల్గొని అమ్మవారిని దర్శించుకున్నారు. హిమాచల్‌నగర్ వద్ద జరిగిన పూజా కార్యక్రమంలో మహిళలు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

గోపాలపట్నం: గోపాలపట్నం ప్రధాన రహదారిలో కొలువుదీరిన నూకాలమ్మ అమ్మవారి జాతర కనుల పండువగా జరిగింది. అధిక సంఖ్యలో భక్తులు తరలివచ్చి అమ్మవారిని దర్శించుకున్నారు.

గోపాలపట్నం పోలీసులు బందోబస్తు నిర్వహించి భక్తులకు ఇబ్బందులు రాకుండా కట్టుదిట్టమైన చర్యలు చేపట్టారు. సాయంత్రం ఘటాల ఊరేగింపు ఉత్సాహంగా సాగింది. బీఆర్‌టీఎస్ సర్వీసు రోడ్డులో పరస సందర్భంగా ఇరువైపులా పలు రకాల గృహోపకరణాలు, ఆట వస్తువులు ఏర్పాటు చేశారు. సాయంత్రం మూడు వేదికల్లో నిర్వహించిన సాంస్కృతిక కార్యక్రమాలు ఆకట్టుకున్నాయి. జబర్దస్త్ కళాకారుల హాస్య ప్రదర్శనలు నవ్వులు పూయించాయి.

పారిశ్రామిక ప్రాంతంలో..

సింధియా: పారిశ్రామిక ప్రాంతంలో నూకాంబిక అమ్మవారి కొత్త అమావాస్య జాతర మహోత్సవాలు ఘనంగా జరిగాయి. జీవీఎంసీ 40వ వార్డు ఏకేసీ కాలనీ, షిప్‌యార్డ్ కాలనీల్లో కొలువైన అమ్మవారికి ఆలయ ధర్మకర్త, వార్డు కార్పొరేటర్ గుండపు నాగేశ్వరరావు ఆధ్వర్యంలో ప్రత్యేక పూజలు చేశారు. అలాగే జీవీఎంసీ 62వ వార్డు తెలుగుదేశం కాలనీలోని నూకాంబిక అమ్మవారికి కార్పొరేటర్ బల్ల లక్ష్మణరావు నేతృత్వంలో పూజలు చేశారు. అమ్మవార్లను వైఎస్సార్‌సీపీ పశ్చిమ నియోజకవర్గ కన్వీనర్ ఆడారి ఆనంద్‌కుమార్, వైఎస్సార్‌టీయూసీ జిల్లా అధ్యక్షుడు కలిదిండి బద్రీనాథ్, తదితరులు దర్శించుకున్నారు. అమ్మవారి దర్శనం కోసం అధిక సంఖ్యలో భక్తులు బారులు తీరారు. ఈ కార్యక్రమంలో 60వ వార్డు కార్పొరేటర్ పీవీ సురేష్, సోమాదుల సురేష్, వరసల మహేష్, దండి శ్యామ్ పాల్గొన్నారు.

కంచరపాలెం: ఐటీఐ కూడలిలో వెలసిన శ్రీరామ్‌నగర్ గ్రామ దేవత నూకాంబికా అమ్మవారి కొత్త అమావాస్య జాతరను నూకాంబిక యువజన సేవా సంఘం ఆధ్వర్యంలో మంగళవారం ఘనంగా నిర్వహించారు. వైఎస్సార్‌సీపీ పశ్చిమ నియోజకవర్గ సమన్వయకర్త ఆడారి ఆనంద్‌కుమార్, వార్డు కార్పొరేటర్ ముర్రువాణీ నానాజీ అమ్మవారికి ప్రత్యేక పూజలు చేశారు. చెంగల ఈశ్వరరావు, పల్లా ఎర్రికుమార్ యాదవ్, శ్రీను పాల్గొన్నారు.

పరిశ్రమల్లో స్థానిక యువతకు ఉపాధి కల్పనకు వినతి


ఆడారి ఆనంద్‌కుమార్‌తో శ్రమ శక్తి కార్మిక సంక్షేమ సంఘ ప్రతినిధి అంగ రాంప్రసాద్

మల్కాపురం: పారిశ్రామిక ప్రాంతానికి చెందిన యువతకు స్థానిక పరిశ్రమల్లో ఉపాధి కల్పించేలా చర్యలు తీసుకోవాలని ఏపీ సూక్ష్మ, చిన్న,మధ్య తరహా ఎంటర్‌ప్రైజెస్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ చైర్మన్ ఆడారి ఆనంద్‌కుమార్‌కు శ్రమ శక్తి కార్మికుల సంక్షేమ సంఘం ప్రతినిధి అంగ రాంప్రసాద్ వినతి పత్రం అందజేశారు. శ్రమ శక్తి కార్మిక సంక్షేమ సంఘం స్థాపించిన సందర్భంగా ఆడారిని మంగళవారం రాంప్రసాద్ ఆయన కార్యాలయంలో కలిశారు. హెచ్‌పీసీఎల్ షిప్‌యార్డ్,కోరమాండల్,డాక్‌యార్డ్,ఎస్‌బీసీ,ఎస్ఆర్,ఆర్‌సీఎల్ వంటి సంస్థల్లో స్థానిక నిరుద్యోగులకు న్యాయం చేయాలని కోరారు.ఆనంద్‌కుమార్‌ను కలిసిన వారిలో సంక్షేమ సంఘ సభ్యులు,ప్రతినిధులు పాల్గొన్నారు.

అందరికీ శుభం జరగాలి


అదనపు కమిషనర్‌ను సత్కరిస్తున్న బ్రహ్మకుమారీస్, వీజేఎఫ్ బృందం

డాబాగార్డెన్స్: షడ్రుచుల ఉగాదితో ప్రారంభమయ్యే శోభకృత్ సంవత్సరంలో ఇంటింటా ఆయురారోగ్యాలు, సిరిసంపదలు, ఆనందాలు నిండాలని జీవీఎంసీ అదనపు కమిషనర్ డాక్టర్ వై. శ్రీనివాసరావు ఆకాంక్షించారు. ప్రజాపిత బ్రహ్మకుమారీస్, వీజేఎఫ్ సంయుక్త ఆధ్వర్యంలో ఉగాది శోభకృత నామ సంవత్సర ఉత్సవాలు మంగళవారం వీజేఎఫ్ ప్రెస్‌క్లబ్‌లో నిర్వహించారు. కార్యక్రమంలో పాల్గొన్న శ్రీనివాసరావు మాట్లాడుతూ ప్రతి అందరికీ మంచి జరగాలని అభిలషించారు. బ్రహ్మకుమారి రామేశ్వరి మాట్లాడుతూ సమాజ పరివర్తనకు ఇటువంటి పండగలు దోహదపడతాయన్నారు. వీజేఎఫ్ అధ్యక్షుడు గంట్ల శ్రీనుబాబు మాట్లాడుతూ సమాజానికి సేవలందించే మీడియా మిత్రులు సంతోషంగా ఉండాలని, ఈ ఉగాది నుంచి అందరికీ అంతా బాగుండాలని ఆకాంక్షించారు. ఈ సందర్భంగా పలువురు పాత్రికేయులకు ఉగాది కిట్లు అందజేశారు. అదనపు కమిషనర్ శ్రీనివాసరావును సత్కరించారు. కార్యక్రమంలో నాగరాజ్ పట్నాయక్, దాడి రవికుమార్, ఎంఎస్ఆర్ ప్రసాద్, ఈశ్వరరావు, బ్రహ్మకుమారి సత్యవతి తదితరులు పాల్గొన్నారు.

రాగి జావతో సంపూర్ణ ఆరోగ్యం

మల్కాపురం: జగనన్న గోరుముద్ద కార్యక్రమంలో భాగంగా రాగి జావ పంపిణీ కార్యక్రమం మంగళవారం పశ్చిమ నియోజకవర్గంలోని ప్రభుత్వ పాఠశాలల్లో ఘనంగా ప్రారంభమైంది. రాగి జావలో పోషకాలు పుష్కలంగా ఉంటాయని పలువురు అభిప్రాయపడ్డారు. 58వ వార్డు శ్రీహరిపురం జీవీఎంసీ పాఠశాలలో విద్యార్థులకు కార్పొరేటర్ గులిగిందల లావణ్య రాగి జావ పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ వార్డు అధ్యక్షుడు గులిగిందల కృష్ణ, ఉపాధ్యాయులు పాల్గొన్నారు. 59వ వార్డు పరిధి కొత్తనక్కవానిపాలెం జీవీఎంసీ పాఠశాలలో పార్టీ వార్డు అధ్యక్షుడు పుర్రె సురేష్‌యాదవ్ పాల్గొని విద్యార్థులకు రాగిజావ అందించారు. 61వ వార్డు ప్రకాష్‌నగర్, ఇండ్రస్టియల్ కాలనీలోని జీవీఎంసీ పాఠశాలల్లో పార్టీ నాయకుడు దాడి సత్యనారాయణ పాల్గొని విద్యార్థులకు రాగిజావ పంపిణీ చేశారు.

40వ వార్డులో..

సింధియా: జీవీఎంసీ 40వ వార్డులోని గాంధీగ్రామం జీవీఎంసీ హైస్కూల్‌లో రాగిజావ పంపిణీని వార్డు కార్పొరేటర్ గుండపు నాగేశ్వరరావు ప్రారంభించారు. ఈ సందర్భంగా నాగేశ్వరరావు మాట్లాడుతూ జగనన్న గోరుముద్ద పథకంలో భాగంగా వారంలో మూడు రోజులు మంగళ, గురు, శనివారాలు విద్యార్థులకు రాగిజావ అందిస్తామన్నారు. దీని ద్వారా విద్యార్థుల్లో పోషకాహార లోపాన్ని అధిగమించడంతో పాటు రక్తహీనతను నివారించవచ్చునని చెప్పారు. కార్యక్రమంలో స్కూల్ పేరెంట్స్ కమిటీ సభ్యులు, పాఠశాల ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

గోపాలపట్నం: రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన జగన్న గోరు ముద్ద కార్యక్రమంలో భాగంగా పాఠశాలల్లో మంగళవారం రాగిజావ పంపిణీ చేశారు. కరాసా జీవీఎంసీ ప్రాథమిక పాఠశాలలో డిప్యూటీ మేయర్ జియ్యాని శ్రీధర్, గోపాలపట్నం జిల్లా పరిషత్ పాఠశాలల్లో జీవీఎంసీ కోఆప్షన్ సభ్యుడు బెహరా భాస్కరరావు విద్యార్థులకు రాగి జావ అందించి కార్యక్రమాన్ని ప్రారంభించారు.


61వ వార్డులో విద్యార్థులకు రాగిజావ పంపిణీ చేస్తున్న దాడి సత్యనారాయణ



విద్యార్థులకు రాగిజావ అందిస్తున్న కార్పొరేటర్ నాగేశ్వరరావు


గోపాలపట్నం హైస్కూల్‌లో విద్యార్థులకు రాగి జావ అందిస్తున్న బెహరా భాస్కరరావు


కరాసా పాఠశాలలో విద్యార్థులకు రాగి జావ అందిస్తున్న జియ్యాని శ్రీధర్

క్యాంపస్ ఇంటర్వ్యూల్లో విద్యార్థుల ప్రతిభ


ఎంపికైన విద్యార్థులతో కళాశాల ప్రిన్సిపాల్ మురళీకృష్ణారావు

గోపాలపట్నం: హెటిరో డ్రగ్స్ సంస్థ ఇటీవల గోపాలపట్నం ఆదిత్య డిగ్రీ కళాశాలలో నిర్వహించిన క్యాంపస్ ఇంటర్వ్యూల్లో 24 మంది విద్యార్థులు ఎంపికయ్యారు. ఈ సందర్భంగా ఎంపికైన విద్యార్థులను ప్రిన్సిపాల్ కె.మురళీకృష్ణారావు, హెటిరో డ్రగ్స్ హెచ్‌ఆర్ మణికంఠ అభినందించారు. బీఎస్సీ కెమిస్ట్రీ విద్యార్థులు ఈ ఉద్యోగాలు సాధించారు.

